పేద రైతులకు యూరియా కష్టాలు



యూరియా కోసం సొసైటీ కార్యాలయ ఆవరణలో అవస్థలు పడుతున్న రైతులు

సొసైటీ వద్ద బారులు తీరిన అన్నదాతలు

- వందల బస్తాలు తరలించేస్తున్న వైనం
- ప్రైవేట్ దుకాణాల్లో బస్తా రూ.400కుపైగా విక్రయాలు

సోమశిల: అనంతసాగరం మండలంలోని వ్యవసాయ సహకార సంఘం వద్ద బుధవారం రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో సుమారు 5000 ఎకరాల వరిపంటను రైతులు సాగు చేస్తున్నారు. ఆది నుంచే నారుమడికి యూరియా అవసరం అవుతుందని రైతులు అంటున్నారు. ఈ ఎడగారు ప్రారంభమైన నుంచి మండల వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా అందుబాటులో లేక డీలర్ల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ధరపై భారీగా వసూలు

ఆర్‌ఎస్‌కే, సొసైటీల వద్ద యురియా అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు తప్పని పరిస్థితిలో గ్రామాల్లోని ప్రైవేట్ దుకాణాల్లో యూరియాను కొనుగోలు చేసి పంటకు వేస్తున్నారు. ప్రభుత్వ ధర బస్తా రూ.266 అయితే అదనంగా రూ.150పైగా తీసుకుంటూ రూ.420లకు విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సన్నకారు రైతులకు ఇవ్వకుండా..

మండల కేంద్రంలోని సొసైటీకి ఇటీవల రెండు విడతలుగా 40 టన్నుల యూరియా వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అయితే వచ్చిన సరుకును సన్నకారు రైతులకు ఇవ్వకుండా వందల ఎకరాలు సాగుచేసిన వారికి 50, 60 బస్తాల చొప్పున రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా పంపిస్తున్నారు. తక్కువ మొత్తంలో వరి సాగుచేసే పేదవారికి ఇవ్వకపోవడంతో డీలర్ల వద్ద కొనడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నారని రైతులు బాధపడుతున్నారు.

రాత్రికి రాత్రే తరలింపు

మండల పరిధిలోని పాతదేవరాయపల్లికి చెందిన బిల్లుపాటి శ్రీను, వెంగంపల్లి గంగిరెడ్డి, కృష్ణారెడ్డి మరికొందరు రైతులు మాట్లాడుతూ సొసైటీ వద్ద యూరియా ఇస్తున్నట్లు చెప్పడంతో రెండు సార్లు వచ్చి వెనుదిరిగామన్నారు. మంగళవారం మేము చూస్తుండగా రెండు లారీల యూరియాను సొసైటీలో దించారని, అయితే బుధవారం వచ్చి యూరియా కావాలని సొసైటీ వారిని అడిగితే స్టాక్ లేదు.. అందరికీ ఇచ్చామని చెబుతున్నారన్నారు. రెండు లారీల యూరియా ఎవరికి ఇచ్చారని, రాత్రి ట్రాక్టర్లతో వారి అనుచరులకు లోడ్లు పంపిస్తున్నారని, నాయకుల సిఫార్సు ఉంటేనే యూరియా దక్కే పరిస్థితి అనంతసాగరం సొసైటీ వద్ద కనిపిస్తోందని వారు వాపోయారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

యూరియా అవస్థలపై మండల వ్యవసాయాధికారి శైలజ కుమారిని వివరణ కోరగా బుధవారం సొసైటీ వద్దకు వచ్చిన రైతులకు ఐదు బస్తాల చొప్పున అందించామని, యూరియా అందని రైతులు ఉంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సొసైటీలో మరో రెండు రోజుల పాటు యూరియా అందిస్తామన్నారు. అధిక ధరలకు యూరియా విక్రయాలు చేసిన డీలర్లను విచారించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే ఇబ్బందులు



సొసైటీ ఎదుట వాపోతున్న రైతులు

గత ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులు ఎన్నడూ చూడలేదని, ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రైతులను పట్టించుకునే వారు కరువయ్యారని ఆందోళన చేస్తున్న పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని, ఇప్పటికైనా సొసైటీకి పంపిన స్టాక్ ఎంతమంది రైతులకు ఇచ్చారు.. వారు నిజమైన రైతులేనా విచారణ చేసి సొసైటీ వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రతి రైతుకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

జలదంకిలో స్పెషల్ గ్రీవెన్స్ డే నేడు

జలదంకి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ అధ్యక్షతన స్పెషల్ గ్రీవెన్స్ డేను గురువారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రమీల బుధవారం తెలిపారు. రెవెన్యూ, శాంతి భద్రతల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు.

ఆత్మీయ సన్మానం



సోమశిల: అనంతసాగరం మండల కేంద్రంలోని సచివాలయం 1, 2లలో ఐదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న 11 మంది సిబ్బంది బదిలీపై వెళ్తుండడంతో వారికి ఆత్మీయ సన్మానం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న వెల్ఫేర్/ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు బొమ్మిశ్శ మురళి, ఎన్వీ సాయిదుర్గ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, ప్రీతి, హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు మైమున్నిసా, యశోద, ఏఎన్‌ఎంలు ఖాజమ్మ, మస్తాన్ బీ, వీఆర్వో రాజేశ్వరి, సర్వేయర్ రసూల్, డిజిటల్ అసిస్టెంట్ హరిబాబు నాయక్‌లకు వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ సెక్రటరీ బత్రెడ్డి జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. పెయ్యల సంపూర్ణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, సర్పంచ్ శోభ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఎస్‌ఎస్ చైర్మన్ ఎన్నిక 12న

ఉదయగిరి: మండలంలోని దుర్గంపల్లి ఎస్సీ కాలనీ (వన సంరక్షణ సమితి) వీఎస్‌ఎస్ చైర్మన్ ఎన్నిక ఈనెల 12న నిర్వహించనున్నట్లు అటవీ శాఖ అధికారులు బుధవారం వెల్లడించారు. ఈ మేరకు గ్రామంలో నోటీసులు అంటించారు. ప్రస్తుతం పనిచేస్తున్న వీఎస్‌ఎస్ చైర్మన్ బుజ్జయ్య మృతిచెందడంతో ఎన్నికను నిర్వహిస్తున్నారు.

ఘనంగా విద్యార్థి దినోత్సవం

ఆత్మకూరు: జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని ఆత్మకూరులో ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత భారీ ర్యాలీ చేశారు. సత్రం సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు ర్యాలీ సాగింది. విద్యార్థి నాయకులు అవినాష్‌రెడ్డి, సుకుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు ఏహెచ్‌ఏల బదిలీ

సీతారామపురం: మండలంలోని నెమళ్లదిన్నె సచివాలయ ఏహెచ్‌ఏగా పనిచేస్తున్న ముక్కు శైలేంద్ర బాలాయపల్లి సచివాలయానికి, అక్కడ ఏహెచ్‌ఏగా పనిచేస్తున్న శ్రీనివాసులు నెమళ్లదిన్నె సచివాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఇరువురు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

సీతారామపురం ఎంపీడీఓగా గోపిశ్రీనివాస్

సీతారామపురం: వింజమూరు డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న జి.గోపిశ్రీనివాస్ పూర్తి అదనపు బాధ్యతలతో సీతారామపురం మండలానికి బుధవారం నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ రెగ్యులర్ ఎంపీడీఓగా చేస్తున్న భాస్కర్ సుదీర్ఘ కాలం సెలవుపై వెళ్లారు.

విద్యాసామగ్రి పంపిణీ



మర్రిపాడు: మండలంలోని సింగనపల్లి మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పసుపులేటి సంటెమ్మ సేవా సంస్థ ద్వారా జి.శ్రీనివాసులు సహకారంతో అందజేశారు. వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు సుధాకర్, వెంకటసుబ్బయ్య, సుబ్బారావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు వీరభద్ర కుమారి, సబీహ పాల్గొన్నారు.

16న ఉపసర్పంచ్ ఎన్నిక

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక ఈనెల 16న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ ఉపసర్పంచ్‌గా ఉన్న విజయలక్ష్మి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైందన్నారు. ఈ క్రమంలో 16న పంచాయతీ పాలక వర్గం సమావేశమై ఉపసర్పంచ్‌ను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

మొక్కలను తొలగిస్తే జరిమానా

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం–ఆత్మకూరు రహదారి మధ్య డివైడర్‌లో ఇటీవల మున్సిపల్ సిబ్బందిచే నాటించిన పలురకాల పూలమొక్కలను తొలగిస్తే జరిమానా తప్పదని కమిషనర్ గంగాప్రసాద్ బుధవారం తెలిపారు. ఆయా ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. మొక్కలను తొలగిస్తే రూ.5 వేల జరిమానా ఉంటుందన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఆత్మకూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: మోసపూరిత మేనిఫెస్టోతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఏడాదైనా వాటిని అమలు చేయకుండా కూటమి చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో నిర్వహించే కార్యక్రమం గురించి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, రాష్ట్ర మున్సిపల్ కమిటీ కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిమి రమేష్‌రెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండా వెంకటేశ్వర్లు మాట్లాడారు. చంద్రబాబు ఇచ్చిన హామీలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు ప్రశ్నించడంలేదని నిలదీశారు. ప్రతి ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కూటమి హామీలను ఎండగట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన లబ్ధితో పాటు కూటమి ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు.

దాడులు మంచి పద్ధతి కాదు

నెల్లూరులో మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి హేయమైన చర్య అని పార్టీ నాయకులు మండిపడ్డారు. విమర్శకు ప్రతి విమర్శ చేయాలే తప్ప జిల్లాలో ఎన్నడూ లేనివిధంగా ఇళ్లపై దాడి సంస్కృతి తగదన్నారు. పార్టీ మండలాల కన్వీనర్లు చెన్ను వెంకటేశ్వరరెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు నందా ఓబులేసు, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు నందవరం ప్రసాద్, వలంటీర్ విభాగ అధ్యక్షుడు ఒంటేరు సుధీర్‌రెడ్డి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కె.ప్రసాద్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసులు, ఎస్టీసెల్ అధ్యక్షుడు మానికల చందన్ కుమార్, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, తోడేటి అశోక్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



కర్తం శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న మేకపాటి



కలిగిరిలో రాజ్యలక్ష్మి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మేకపాటి



కావలిలో పెద్దిశెట్టి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రామిరెడ్డి

కొండాపురం : మండలంలో శెట్టిపాళెం పంచాయతీ సర్పంచ్ దంపూరి రాజా తల్లి ఇటీవల మృతిచెందింది. ఈ క్రమంలో ఆయన కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. రేణమాలలో రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ కర్తం శ్రీనివాసరెడ్డి కిడ్నీ మార్పించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా, ఆయన్ను కూడా పరామర్శించారు. అలాగే తూర్పుయర్రబల్లి పంచాయతీ మన్నంవారిపల్లిలో మాజీ సర్పంచ్ కొండయ్య మామ ఎరుకలయ్యపై ఇటీవల టీడీపీ నేత శ్రీకాంత్ దాడి చేశాడు. దీంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించాడు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిమ్మిలి రవీందర్‌నాయుడు, పార్టీ నేతలు చిమ్మిలి రాజేంద్రప్రసాద్, వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎడ్లపల్లి వెంకటరమణయ్య, మనం వెంకటసుబ్బయ్య, సర్పంచ్‌లు దార్ల గోపి, శేఖర్‌రెడ్డి, దావులూరి చిన్నకొండయ్య, వీరెల్ల చంద్రయ్య, పి.కమలాకర్, కోనేటి లక్ష్మణ్, యర్రవ వెంకటేశ్వర్లు ఉన్నారు.

- కలిగిరి: వైస్ ఎంపీపీ పొన్నం రాజ్యలక్ష్మి భర్త నాగేశ్వరరావు ఇటీవల మరణించడంతో బుధవారం మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వారి నివాసంలో పరామర్శించారు. అలాగే కావలి ముస్తాపురంలో మాజీ సర్పంచ్ మాలేపాటి వెంకటసుబ్బయ్య తండ్రి తిరుపతినాయుడు వృద్ధాప్య సమస్యలతో బాధపడుతుండటంతో ఆయన్ను పరామర్శించారు. జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీ అహ్మద్ ఉన్నారు.
- జలదంకి: మండలంలోని చామదల గ్రామంలో పలు కుటుంబాలను మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం రాత్రి పరామర్శించారు. టీడీపీ నేతల దాడిలో గాయపడిన నగ్గ వెంకటేశ్వర్లును, బొందు సురేష్ కుమారుడు సుధీర్ చెరువులో పడి మృతిచెందగా అతని కుటుంబాన్ని, పార్టీ కార్యకర్త పందిటి చిన్నయ్య మృతిచెందడంతో అతని కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే లెగ్ ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బుట్టి వెంకటరమణమ్మను, దేవరపల్లి శ్రీనివాసులు రెడ్డిలను పరామర్శించారు. మండల కన్వీనర్ ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు దేవరపల్లి రఘురామిరెడ్డి, వంటేరు లక్ష్మీనరసారెడ్డి, దేవరపల్లి విజయ్‌రెడ్డి, కూరపాటి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.
- కావలి (జలదంకి): కావలి పట్టణం బృందావనం కాలనీకి చెందిన వేమూరు పెద్దిశెట్టి భార్య ఇటీవల మృతిచెందడంతో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అలాగే 23వ వార్డు ఇన్‌చార్జి కనపర్తి రాజశేఖర్ తల్లి అనారోగ్యంతో నెల్లూరులోని హాస్పిటల్లో చికిత్స పొందుతోంది. దీంతో రామిరెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి



మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

కలిగిరి: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎంపీపీ మెట్టుకూరి శిరీష తెలిపారు. కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలిగిరి పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి ఉన్నా కొందరు వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశానికి హాజరుకాని అధికారుల జాబితాను కలెక్టర్‌కు పంపాలని ఎంపీడీఓకు సూచించారు. ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

ఆత్మకూరు: ప్రతి గ్రామ పంచాయతీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ రఫీఖాన్ కోరారు. పంచాయతీ పురోగతి సూచిక, ఆర్థిక పరిస్థితులపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలన్నారు.

- చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలలిత ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, ఏఎన్‌ఎం, ఇంజినీరింగ్ సహాయకులకు పంచాయతీ అడ్వాన్స్‌డ్ ఇండెక్స్ పోర్టల్‌పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అప్పాజీ మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ ఇండెక్స్ పోర్టల్ 2.0 వర్షన్ ద్వారా అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి అప్‌లోడ్ చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ కరిముల్లా పాల్గొన్నారు.
- కొండాపురం : పంచాయతీ ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆదినారాయణ బుధవారం నిర్వహించారు. తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యాలయ ఏఓ శేషసాయి, ఎంఈఓ రవికుమార్ పాల్గొన్నారు.
- దుత్తలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ముందుగా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ హనుమంతరావు పలు సూచనలు చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జున పాల్గొన్నారు.
- సీతారామపురం: పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ అన్నారు. ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల పురోగతిపై నిర్వహించిన శిక్షణా శిబిరంలో బుధవారం పాల్గొని, పలు సూచనలు ఎంఈఓ మస్తాన్‌వలీ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు హనీనిస్సి, రామకృష్ణ, ఏపీఓ శ్యామలాదేవి పాల్గొన్నారు.
- అనుమసముద్రంపేట: పంచాయతీ పురోగతి సూచికలపై శిక్షణా కార్యక్రమం ఏఎస్‌పేట ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి హాజరై పలు సూచనలు చేశారు.
- వింజమూరు(ఉదయగిరి): స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీల పురోగతిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈఓపీఆర్డీ గోపి శ్రీనివాస్ పలు సూచనలు చేశారు.
- వరికుంటపాడులో మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.
- సంగం: స్థానిక మండల కార్యాలయంలో ఎంపీడీఓ షాలేట్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ సోమ్లానాయక్ పలు సూచనలు చేశారు.

బీఎల్వోలకు శిక్షణ

వరికుంటపాడు: స్థానిక వెలుగు కార్యాలయంలో బీఎల్వోలకు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్.చెంచయ్య పలు సూచనలు చేశారు. ఏఎస్‌ఓ సలీమ్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు

కావలి (జలదంకి): కావలి పట్టణ, రూరల్ మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలుంటాయని రూరల్ సీఐ రాజేశ్వరరావు అన్నారు. ఆయన ముసునూరు ప్రాంతం పాఠశాలల సమీపంలోని దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. నిబంధనలు పాటించాలని తెలిపారు. రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి ఉన్నారు.

- సంగం: సంగం హైస్కూల్‌కు వంద మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాల్లో ఎస్సై రాజేష్ బుధవారం తనిఖీలు చేపట్టారు. నిషేధిత వస్తువుల అమ్మకాలు చేయరాదని హెచ్చరించారు.
- ఉదయగిరి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఉన్న దుకాణాలను ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఐదు దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తుండడంతో జరిమానాలు విధించారు.

వైభవంగా గ్రామోత్సవం



జలదంకి: మండలంలోని వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఆలయ చైర్మన్ మేకల శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా ప్రకటించాలి

ఉదయగిరి రూరల్: జిల్లాలో ప్రాచీనమైన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా ప్రకటించాలని ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరమ్ ప్రతినిధులు వి.రామచంద్రమూర్తి, ఎండీ ఖాజా బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అందుకు తగినట్లు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్రగాయాలు

సంగం: మండలంలోని అనసూయ నగర్ సమీప పొలాల్లో బుధవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై భానుచంద్ర అనే రైతుకు తీవ్రగాయాలయ్యాయి. వేరుశనగ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెట్లు కొడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో నెల్లూరుకు తరలించారు.

ప్రసన్న ఇంటిపై దాడి హేయం



ప్రసన్న కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రామిరెడ్డి

కావలి (జలదంకి): మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై పచ్చమూకల దాడి హేయమైన చర్య అని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. నెల్లూరు నగరంలోని ప్రసన్న నివాసానికి కావలి నేతలతో ఆయన బుధవారం వెళ్లి పరామర్శించారు. అనంతరం ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం సహజమన్నారు. కానీ ఇళ్లపై గూండాలతో దాడులు చేసి హత్యా ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. దీనికి కారకులపై పోలీసులు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, పందిటి కామరాజు, కృష్ణారెడ్డి, చైతన్య, పి.వంశీరెడ్డి, కొండూరు శ్రీనివాసులు, మహేష్, ఆత్మకూరి రాజేష్ ఉన్నారు.

లేబర్ కోడ్ల రద్దుకు డిమాండ్



ఆత్మకూరు పట్టణంలో..

ఆత్మకూరు : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ల రద్దుకు సీఐటీయూతో పాటు పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో వారు బుధవారం నిరసన ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. ఆర్టీసీ డిపో వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ఆశా, అంగన్‌వాడీ, ఆటో వర్కర్, రైతు సంఘం, కూలీల సంఘం, తదితర సంఘాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రం 8 గంటల పనివిధానాన్ని అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు శివప్రసాద్, మండలాధ్యక్షుడు నాగయ్య, కార్యదర్శి హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

- సోమశిల: అనంతసాగరం మండల కేంద్రంలోని బద్వేల్ టర్నింగ్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించి రాస్తా రోకో చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా పాల్గొన్నారు.
- చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు బుధవారం సమ్మె నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు.
- అల్లూరు: అల్లూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రాన్ని అందించారు. సీఐటీ యూ మండల కోశాధికారి అబ్దుల్ రషీద్, ఆశా వర్కర్ల జిల్లా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.
- వింజమూరు(ఉదయగిరి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సమస్యల పరిష్కారానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేశారు. యూనియన్ నేతలు శ్రీదేవి, శారద పాల్గొన్నారు.
- వరికుంటపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీటీ చెంచయ్యకు వినతిపత్రం అందజేశారు. రజియా, హరినారాయణ పాల్గొన్నారు.
- ఉదయగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏపీ రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఉదయగిరిలో జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో బుధవారం పాల్గొన్నారు. సీపీఎం కార్యాలయం నుంచి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వీఆర్ఏలు, రైతు కూలీలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు.
- సీతారామపురం: కార్మికుల సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు కోడె రమణయ్య, అంగన్‌వాడీలు మమత, ఆదిలక్ష్మి, సుహాసిని, షాలిని, రాజకుమారి పాల్గొన్నారు.
- మర్రిపాడు: స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రహంతుల్లా, మూలి వెంగయ్య పాల్గొన్నారు.

జైళ్ల ఆడిట్ కమిటీ చైర్మన్‌గా కావలి వాసి

కావలి (జలదంకి): జాతీయ స్థాయిలో జైళ్ల ఆడిట్ కమిటీ చైర్మన్‌గా ఏపీ జైళ్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఇండ్ల శ్రీనివాస్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించడం హర్షణీయమని కావలి లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ఇండ్ల శ్రీనివాస్ కావలి నివాసి అని, ఆయన జైళ్ల శాఖకు అంకితభావంతో అందించిన సేవలు రాష్ట్రంతో పాటు కావలికి గుర్తింపు వచ్చిందన్నారు.

న్యాయం చేయాలి

దగదర్తి: ధ్రువపత్రాల కోసం వెళ్తే హెచ్‌ఎం దాడి చేసి గాయపరిచారని, దీనిపై పోలీసులు తనకు న్యాయం చేయాలని ఉపాధ్యాయిని ప్రమీల కోరారు. ఈ మేరకు ఆమె దగదర్తిలో బుధవారం మాట్లాడుతూ కట్టుబడిపాళెం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుబ్బారావు గతంలో కూడా అనేక సార్లు వేధింపులకు గురిచేశారని, ప్రస్తుతం మనుబోలుకు బదిలీపై వెళ్లడంతో ధ్రువపత్రాల కోసం వెళ్తే దాడి చేశారని, అడ్డుకోబోయిన తన భర్త ప్రసాద్‌పై కూడా దాడి చేశారని తెలిపారు. ఈ క్రమంలో హెచ్‌ఎంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.